

వాడ్రేవు చినవీరభద్రుడు

# కోమలనిషాదం

మరికొన్ని కవితలు

వాడ్రేవు చినవీరభద్రుడు

# కోమలనిషాదం

మరికొన్ని కవితలు

**KOMALA NISHADAM**

a collection of poems by

**VADREVU CHINAVEERABHADRUDU**

January, 2025

Coverpainting in oilpastels, book composing and layout

Vadrevu Ch Veerabhadrudu

**e-book** released by

**Vadrevu Ch Veerabhadrudu**
First floor, 56, Navodaya colony,
Mehidipatnam,
Hyderabad- 500 028

chinaveera@gmail.com

+91 94909 57129

for more resources please visit

**www.chinaveerabhadrudu.in**

నాగరాజు రామస్వామి గారికి

# సంక్రాంతి కానుక

**ఇప్పటిదాకా** నేను ఏడు కవితా సంపుటులు వెలువరించాను: నిర్వికల్ప సంగీతం (1986), ఒంటరిచేల మధ్య ఒక్కత్తే మన అమ్మ (1995), పునర్యానం (2004), కోకిల ప్రవేశించే కాలం (2009), నీటిరంగుల చిత్రం (2014), కొండ మీద అతిథి (2018), కొండ కింద పల్లె (2021).

ఆ తర్వాత నాలుగేళ్ళుగా రాస్తూ వచ్చిన కవితలు లెక్కవేస్తే నలభై మూడు దాకా లెక్క తేలాయి. వీటితోపాటు ఇప్పటిదాకా ఏ సంపుటాల్లోనూ చేరని ఏడు కవితల్ని కూడా కలిపి మొత్తం యాభై కవితలు ఇలా సంపుటిగా పొందుపరిచి సంక్రాంతి కానుకగా మీతో పంచుకుంటున్నాను.

కరీంనగర్‌కి చెందిన నాగరాజు రామస్వామిగారు గొప్ప భావుకుడు, కవి, అనువాదకుడు. నిగర్వి. ముఖ్యంగా నా పట్ల ఆయన వాత్సల్యానికి అవధి లేదు. అందుకని వారికి ఈ సంపుటాన్ని సమర్పించుకుంటున్నాను.

హైదరాబాదు **వాడ్రేవు చినవీరభద్రుడు**

14 జనవరి 2025

# వరసగా


| | |
|---|---|
| సుజాత | 9 |
| ఒక అశ్వం ఎదురుపడిన క్షణం | 12 |
| దూరం చెయ్యని వీడ్కోళ్లు | 14 |
| వేయిస్తంభాల గుడి | 16 |
| కీర్తి తోరణం, ఖిలా వరంగల్ | 17 |
| రామప్ప | 19 |
| తాడవాయి నుంచి ఏటూరు నాగారం | 21 |
| కవిత ఉదయించే వేళ | 23 |
| ఎందుకని? ఎందుకని? | 24 |
| తొలివానగాలి | 25 |
| వెలుగుతోట | 27 |
| కణ్ణబెణ్ణ | 29 |
| ఎర్రపూల చెట్టు | 31 |
| ఎందుకో ఈ రోజు | 33 |
| ప్రళయాంతవేళ | 34 |
| నువ్వులేవు, నీ పాట ఉంది | 41 |
| హేమంతచంద్రిక | 43 |
| ఇంకా తెల్లవారని వేళ | 47 |

| | |
|---|---|
| కుహూరవం | 48 |
| ఆ ఒక్క క్షణమే | 50 |
| దేవతగా మారిన కవయిత్రి | 52 |
| భగవంతుడి చూపులు | 54 |
| ఆమె ఆలపించడం మొదలుపెడుతూనే | 56 |
| నా కవితలూ, నా పాఠకుడూ | 57 |
| కొత్తరోజు | 58 |
| తన ధ్యాసంతా | 59 |
| చెట్లు మేలుకునే దృశ్యం | 60 |
| రమణీ ప్రియదూతిక | 61 |
| పూలప్రళయం | 62 |
| ప్రేమ మరక | 63 |
| తెల్లవారకుండానే | 64 |
| ఉండీ ఉండీ కోకిల అరుస్తుంటుంది | 66 |
| వానకి తడుస్తున్న చెట్లు | 67 |
| గాలిపటాల ఋతువు | 69 |
| పాడకుండా ఉండలేని పాట | 71 |
| మరీ ముఖ్యంగా ఈ మాఘమాసం | 73 |
| నువ్వొక చాతకం కావాలేగానీ | 75 |
| ఆ ఉత్తరం | 77 |
| ఇంకా తెల్లవారకుండానే | 78 |
| నారుమడిపొయ్యడానికి | 79 |
| పొద్దుణ్ణుంచి చూస్తున్నాను | 80 |

పొద్దున్నే నగరాన్ని 82
చిత్రగ్రీవం 83
పట్టపగలే ఆకాశానికి 85
ఆమె తన కొంగున 86
తలుపులు మూసేసినట్టు 87
తాళ్లు కట్టి మరీ 88
పాట పాడే ఇప్పచెట్టు 89
ఒక కార్తిక అపరాహ్ణం 92
కోమలనిషాదం 94

## సుజాత

ఊరిపొలిమేరల్లో
వెలిసిన అమ్మవారి కోవెల్లో
వెలిగే మట్టిప్రమిదలో దీపం ఆమె.

పండిన వరి పైర్లలో
పంటకోతలప్పుడు
పాడుకునే పాటల మధ్య
ప్రసరించే పసిడి సంధ్యాకాంతి ఆమె.

నల్లని కొండల తొడిమలోంచి
రోజుకొక్క రేక చొప్పునవిప్పారే
వెండిరేకల జాబిల్లి పువ్వు ఆమె.

అనాథ బాలికలకు
నీడనిచ్చే ఆకాశ పందిరిలో
అన్నిటికన్నా ముందు
విప్పారే తొలి నక్షత్రపుష్పం ఆమె.

గోదారి కాలువలో కునికే
గూటిపడవ మూగి నిద్దట్లో

కలల కాంతిరేఖలా
ఊగాడే చిరుదీపం ఆమె.

సముద్ర ప్రచండ తరంగాల యెదట
వలలు పన్ని నిరీక్షించే
ఎడతెగని ఇసుక తిన్నెల నడుమ
మినుకుమనే ఇలాయి దీపం ఆమె.

మట్టిబాట వెంబడి
చింతతోపుల్లోంచి
కిర్రుమంటో కాళ్ళీడ్చుకునే
ఎడ్లబండికి
వేలాడే పలకల దీపం ఆమె.

ఆవరించిన
కారుమొయిళ్ళ నడుమ
తటిల్లున మెరిసే
శంపాలత ఆమె.

మొరటుగోడల పైన
పూసిన ఎర్ర గడ్డిపువ్వులా
ప్రతి నిశాంతానా
భగవంతుడు చిత్రించే
భానుగీత ఆమె.

దైనందిన జీవన పంకంలో
సదా నవజాత–

ఆమె
సుజాత.

(బిమల్‌రాయ్ సుజాతని ప్రేమించినారందరికీ కాన్కగా)

1995

## ఒక అశ్వం ఎదురుపడిన క్షణం

నగరంలో
నడి ట్రాఫిక్ సమ్మర్దంలో
అన్ని వాహనాల మధ్య ఒక ఆశ్వికుడు
ఆ అశ్వం.

ఆ గుర్రం నాకు గుర్రాన్ని గుర్తుకు తెచ్చింది.

ఆ స్ఫురణలో
దౌడు తీస్తున్న అశ్వాల గుంపులు
పచ్చిక మైదానాలు
రక్తం పారే రణభూములు.

ఇంతలో మళ్ళీ
ట్రాఫిక్ లైట్లు,
కానిస్టేబుల్ విన్యాసాలు–

అన్ని వాహనాలతో పాటు
అశ్వం కూడా ముందుకు కదిలింది.

అయితేనేం, ఆ అశ్వం
ఒక క్షణం నన్ను ఆశ్వికుణ్ణి చేసింది.
ఇంతలో అదీ నేనూ విడిపోయేం.

వెళ్ళిపోతూ ఆ అశ్వం
నా గుర్రపుశాల
తలుపులు తెరిచి మరీ పోయింది.

1995

# దూరం చెయ్యని వీడ్కోళ్లు

అతడు వెళ్ళిపోతున్నాడు
అదేమంత విషయం కాదు
కానీ కొన్నాళ్ళు అతడు మనతో కలిసి మెసిలాడు
ఆ జ్ఞాపకం ఎంతో ప్రియం
ముఖ్యం, నా వరకు.

జీవితం బహుమేరకు, మర్చిపోవలసిందే
విస్మృతం, వినష్టం కావలసిందే.
కానీ గుర్తుండిపోయే కొన్ని కాంతిరేఖలతోపాటు
అతడూ నాతో ఉంటాడు.

ఇవాళ విడిపోతాం
రేపు అతని కోసం మరొకరు మరొక ఊళ్లో
స్నేహ హస్తాల్తో ఎదురు చూస్తుంటారు.

కొన్ని వెన్నెల రాత్రులు గడుస్తాయి
కొన్ని వానాకాలాలు, కొన్ని సంధ్యా సమయాలు
కొన్నాళ్లపాటు మన గోష్ఠి లో
ఆ జాగా అతన్ని గుర్తు చేస్తూ ఖాళీగా ఉంటుంది

మళ్లా ఒక కొత్త మిత్రుడు
కొన్ని పుస్తకాలు హృదయానికి హత్తుకుని
సవ్వడి చేయకుండా
మన మధ్యకు అడుగు పెడతాడు.
ఇక మన సాయంకాలాలు
నెమ్మదిగా
అతని సంభాషణలతో పరిమళించడం
మొదలెడతాయి.

మాటల మధ్యలో కృష్ణారావు గారంటారు
'చూడండి, ఇతను నవ్వుతోంటే
మన ముకుంద రామారావులా లేడూ!'

కవులు విడిపోవాలి
కలుసుకున్నంత సహజంగా, సంతోషంగా.
అప్పుడు ప్రపంచం మరింత
దగ్గరగా జరుగుతుంది.

8-2-2002

# వేయిస్తంభాల గుడి

ఎండలో చుట్టచుట్టుకు పడుకున్న పాము
దాని పురాతన దేహం మీద పొలుసులు, పొలుసులు.

రాతిని ఒక శంఖం వలె మలచారు
గతించిన కాలాల హోరు అవిరామంగా  వినవస్తున్నది.

పురుషసూక్తం మీద నిర్మించబడ్డ
ఒక కల్పన,
ఆ రాజ్యం గతించిపోయింది,
ఆనవాలు మిగిలిపోయింది.

ఇప్పుడక్కడ దేవుడితో పాటు
ఎలుకలు కూడా నివసిస్తున్నాయి.

17-8-2003

# కీర్తి తోరణం, ఖిలా వరంగల్

శిల్పుల్ని సమావేశపరిచి అడిగాడా రాజు:
'చూడండి, ఈ ముత్యాల హారాలు, ఈ పట్టు పీతాంబరాలు
ఈ రథాలు, హయాలు, మత్తేభాలు,
మంగళవాద్యాలు, స్తోత్రపాఠాలు
ఇప్పుడే వేడి నెత్తురు రుచి చూస్తున్న కరవాలాలు
నిర్మించండి శాశ్వత స్థూపాన్ని
అందరికీ కనబడేలా
ఎప్పటికీ నా యశోవిజయాన్ని.'

అర్థం కాలేదు శిల్పులకదేమీ
వాళ్ళముందొక అస్పష్ట స్వప్నం
అంతులేని రాళ్ళు.

ఒక ప్రభాత వేళ శిల్పుడొకడు
నేస్తుల్ని పిలిచాడు
'చూడండి, ఆకాశంలోకి నేనొక
ఆభరణాన్ని విసిరాన' న్నాడు
'దాన్నక్కడే నిశ్చలంగా నిలిపా'నన్నాడు మరొకడు
కాలగ్రీవంపైన ఆ హారం ఒక తోరణాన్ని తలపించింది.
ఆశ్చర్యం, దివినుంచి హంసలు వాలాయక్కడ.

మట్టికోట కట్ట తెగిన చెరువయ్యింది
రాతికోట అంచు తెగిన పాత్రయ్యింది
రథాలు, హయాలు, మదగజాలు
అదృశ్యమైపోయాయి.
లేవింక ఆ కరవాలాలు, ఆ బజార్లు, ఆ వైడూర్యాలు.
ఎన్ని యుద్ధాలు, ఎన్ని యుగాలు-

కానీ
ఆ తోరణాలు వాడలేదు
ఆ హంసలెగిరిపోలేదు.

17-8-2003

## రామప్ప

అడవిదారిన రాజూ, కవీ ప్రయాణిస్తున్నారు
మధ్యాహ్నపు మగతనీడలో
మద్దిచెట్ల నీడన రాజు కలగన్నాడు
కవి పాటపాడాడు.

అడవి కరిగింది,
పత్రహరితం ప్రవహించి సరసుగా మారింది
నీలిదిగంతం జలతరంగం వాయించింది.
రాజు మేల్కొన్నాడు
'ఇక్కడ నా స్వప్నాన్ని ప్రతిష్ఠించాలనుకుంటున్నా'నన్నాడు

కలల చెరువులు తవ్వి మట్టి తెచ్చారు
వెన్నెల రాత్రుల రాగప్రవాహాల్లో
శిల్పులు తమ హృదయాలు తెప్పలు కట్టేరు
యక్షిణుల, మదనికల, నాగినుల నూపురస్వనాలతో
అడవి చలించిపోయింది.

తెల్లవారేటప్పటికి తడిసిన పచ్చికలో
కుసుమించిన ప్రేమోన్మత్త అధరాలు
గోడలంతా తాపడమయి

మృదంగాలు,  చరణమంజీరాలు.

ఒక రాజు కన్న కల, కవి పాడిన పాట
రామప్ప ఒక రాతిమద్దెల.

17-8-2003

## తాడవాయి నుంచి ఏటూరు నాగారం

దట్టమైన అడవుల్లో ప్రయాణం
వెన్నంటే సంధ్యారాగం.

పచ్చని దారి పొడుగునా పసిగట్టిన
బాల్యపు జాడలు.

ఆమె నన్ను మరొకసారి గాయపరిచి వెళ్ళిపోయింది.
లేత చివుళ్ళ గాలితో హృదయానికి
పసరు పూసింది అడవి.

వసంతం ఈ కొసనా, హేమంతం ఆ కొసనా
నడిచిన దారి పొడవునా నాతో
దాగుడుమూతలాడుతున్నాయి.

దిగబోయే మజిలీలో నా కన్న ముందే
ఆమె జ్ఞాపకాలు బాకుల్తో పొంచి ఉంటాయి.

నడివేసవి వెన్నెల రాత్రి నా కోసం
పూర్వసంతోషాల గాడ్పుల్తో మాటువేసింది.

అడవి అదే, ఆ పక్షి లేదు
హృదయమదే, ఆ రెక్కలేవి?

17-8-2003

## కవిత ఉదయించే వేళ

అవే వీథులు
అవే భవనాలు
అదే కాలవ
కాలవ పక్క చెట్లు
ఇంకా నిద్ర లేవని నది.

చూస్తూ ఉండగానే
నీ కళ్ళ ముందు
రోజా రంగు కాంతి.

అప్పుడు కూడా
అదే ప్రపంచం,

కానీ
ఇంకెంత మాత్రం
ఆ ప్రపంచం కాదు.

27-2-2021

# ఎందుకని? ఎందుకని?

ఎందుకని? ఎందుకని? ఋతుపవనమేఘం ఆవరించగానే
నీకు మరే పనీ చెయ్యాలనిపించదు ఎందుకని?

నిన్నటిదాకా ఎలుగెత్తి పాడిన తురాయిచెట్లు ఇప్పుడు తొలి
వానకి లోగొంతున గుసగుసలాడేదెందుకని?

పొద్దున్నే కిటికీలోంచి తాకిన తెమ్మెర వెనక పూర్వ పరిచిత
సుగంధం నిన్ను వ్యాకులపరిచిందెందుకని?

వానపిలుపు విని ఊరుదాటి కొండదారిన వెళ్ళినప్పుడు
వింతకాంతి సొంతమనిషిలాగా చేరదీసిందెందుకని?

నీకెన్నటికీ చేరువకాని ఆ సముద్రతీరస్నేహితురాలు
ప్రతి జూన్‌లోనూ పదే పదే జ్ఞాపకమొస్తుందెందుకని?

12-6-2021

## తొలివానగాలి

చలిగాలి చలిగాలి తొలివానగాలి ఏ
కొలిమితిత్తుల మంటదో, ఈ
చలిగాలి చలిగాలి తొలివానగాలి.

ఆకసమ్మున మొయిలు బయలుదేరెనొ లేదొ
రాగరంజితమగును పూర్వదుఃఖానలము
వీచుచున్నది గాలి సేదదీర్చుటమాని
రాచుచున్నది ఎడద మరచిపోయిన పాట.

చలిగాలి చలిగాలి పుప్పొడులగాలి ఏ
కొలిమితిత్తులు పూచెనో, ఈ
చలిగాలి చలిగాలి పుప్పొడులగాలి.

కడిమిపూవుల గాలి కెరలించి నా యెదను
అడగిపోయిన దిగులు మరల కికురించినది
కలలు కోరికలెటకొ తరలిపోయిన వెనక
చెలగి రేగినదేల కరకు కస్తురి గాలి.

చలిగాలి చలిగాలి రంపాల గాలి ఏ
కొలిమితిత్తుల కోతదో, ఈ
చలిగాలి చలిగాలి రంపాల గాలి.

13-6-2021

# వెలుగుతోట

ఎవ్వరమ్మా మణులనిక్కడ
వేనవేలుగ రాశిపోసిరి

ఈ

వెలుగుతోటను ఎవ్వరిక్కడ
కల్పతరువుగ కలిమిపెంచిరి?

దివిని పూసిన దివ్యకాంతిని
ఎవ్వరమ్మా ఏరితెచ్చిరి
గగనవీథుల కనకశోభకు
మేఘమలహరి రాగమద్దిరి.

ఎవ్వరమ్మా మణులనిక్కడ
వేనవేలుగ రాశిపోసిరి

ఈ

వెలుగుతోటను ఎవ్వరిక్కడ
కల్పతరువుగ కలిమిపెంచిరి?

చల్లగాలికి ఉల్లమలరగ
నల్లమలలో సంజెవెలుగుల
మఖవధనువును శిఖరతలమున
పొదివి పట్టితి మదిని పరిచితి.

ఎవ్వరమ్మా మణులనిక్కడ
వేనవేలుగ రాశిపోసిరి

ఈ

వెలుగుతోటను ఎవ్వరిక్కడ
కల్పతరువుగ కలిమిపెంచిరి?

కలతనిద్దుర తొలగిపోయిన
మేలి మెలకువ చెలమలందలి
తేటతీయని ఊటనీటికి
బతుకుగోవుకు దప్పితీరెను.

ఎవ్వరమ్మా మణులనిక్కడ
వేనవేలుగ రాశిపోసిరి

ఈ

వెలుగుతోటను ఎవ్వరిక్కడ
కల్పతరువుగ కలిమిపెంచిరి?

20-6-2021

# కణ్ణబెణ్ణ

కణ్ణబెణ్ణా కణ్ణబెణ్ణా
నింగి నీలిమ సిగను తురిమిన
కణ్ణబెణ్ణా కణ్ణబెణ్ణా!

పాడిపంటలు పొంగిపొర్లే
ఆకుపచ్చని నీ దుకూలము
నీవు నడిచిన తోవ పొడుగున
దివ్యశిల్పము, కావ్యగానము.

కొండపల్లీ బొమ్మనీవే
కూచిపూడికలాపకేళివి
మువ్వమువ్వగ సవ్వడించిన
కృష్ణలీలాతరంగానివి.

కణ్ణబెణ్ణా కణ్ణబెణ్ణా!

ఇసుకతిన్నెలమీద మెరిసే
పేరుతెలియని పాదముద్రలు
శాతవాహన స్వర్ణకాలపు
బౌద్ధభిక్షులఆనవాళ్ళా?

కణ్ణబెణ్ణా కణ్ణబెణ్ణా!

నిర్జనములగు ఎండవేళల
నిన్నదాటున చూసినప్పుడు
నేలపరిచిన కలంకారీ
నేతచీరగ తళుకుమందువు.

కణ్ణబెణ్ణా కణ్ణబెణ్ణా

పనులు, వేసట, వగలనడుమను
పొంగినప్పుడు, కుంగినప్పుడు
నీదు కాటుకకంటిచూపులు
కొంతతేకువ, కొత్తవేకువ.

కణ్ణబెణ్ణా కణ్ణబెణ్ణా

నగరమంతా నిదురమునిగిన
నడిమిరాతిరి నన్నొకణ్ణే
కవిత నొక్కటి కూర్చడానికి
కలలదారుల తేల్చి పోదువు.

కణ్ణబెణ్ణా కణ్ణబెణ్ణా!

(కణ్ణబెణ్ణ అంటే కృష్ణానది. నల్లని నది అని అర్థం. బౌద్ధజాతకకథల్లోనూ, శాతవాహన శాసనాలలోనూ ఆ పేరు కనిపిస్తుంది.)

22-6-2021

# ఎర్రపూల చెట్టు

ఎర్రపూల చెట్టు
ఆ
ఎర్రపూల చెట్టు!

చిన్ననాటినుండి
న
న్నంటిపెట్టుకున్న
ఎర్రపూల చెట్టు!

ఓ
ఎర్రపూల చెట్టు!

మండుటెండవేళ
నా
గుండె చీల్చుచుండు
ఎర్రపూల చెట్టు!

ఈ
ఎర్రపూల చెట్టు!

ఒకరి గుండె చీల్చి
వే
రొకరి మనసుకతుకు
ఎర్రపూల చెట్టు!

నా
ఎర్రపూల చెట్టు!

27-6-2021

# ఎందుకో ఈ రోజు

ఎందుకో నది ఈ రోజు నిశ్శబ్దంగా ఉన్నది
నగరం తన సంరంభంలో తాను మునిగి ఉన్నది.

వెళ్ళిపోతున్న వసంతాన్ని బెంగపడ్డ కోకిల
పదేపదే బేలగా వెనక్కి పిలుస్తూ ఉన్నది.

ఋతుపవనమై కరిగి నీరు కావలసిన గ్రీష్మం
తడబడుతూ ఇక్కడనే తాత్సారం చేస్తున్నది.

పెళ్ళగించిన గుండెలా చాళ్ళుతీసిన మన్నులో
అంకురించడానికి గింజ ఆరాటపడుతున్నది.

నువ్వెన్ని పనుల్లో మునిగితేలుతున్నా, చిన్నా
తలపు పాటై ఎగరాలని తపిస్తూనే ఉన్నది.

2-7-2021

# ప్రళయాంతవేళ

(వనవాసంలో భాగంగా పాండవులు కామ్యకవనానికి వెళ్ళినప్పుడు వారిని చూడటానికి శ్రీకృష్ణుడితో పాటు మార్కండేయుడు కూడా వచ్చాడు.  పాండవులకు పూర్వకాలపు రాజుల గురించీ, స్త్రీల గురించీ, ఋషుల గురించీ చెప్పమని కృష్ణుడు మార్కండేయుణ్ణి అడిగాడు. అప్పుడు మార్కండేయుణ్ణి యుధిష్ఠిరుడు అనేక ప్రశ్నలు అడిగాడు. వాటన్నిటితో పాటు కాలం గురించి కూడా అడిగాడు.)

యుధిష్ఠిరుడు

చెప్పండి మహాత్మా, ఆ అనుభవం గురించి
యుగాంతవేళ, కదిలేవీ, కదలనివీ కూడా
కరిగిపోయేవేళ, దైత్యులకీ, దేవతలకీ
మధ్య హద్దులు చెరిగిపోయేవేళ, మనం
నిలబడ్డ నేలని మోసే దిఙ్నాగాలు కూడా
పక్కకు తప్పుకునే వేళ, కాళ్ళకింద నేల
జారిపోయిన వేళ, మీరేమి చూసారు? దేన్ని
అసరా చేసుకుని నిలబడ్డారు? ఏ ఆశతో
మళ్ళా సృష్టిని స్వాగతించారు?

మార్కండేయుడు

నిజమే, నీవన్నది, నీవడిగింది, నేనెన్నో
యుగాంతాల్ని చూసాను, కల్పాంతాల్ని చూసాను

యుగాంతమెప్పుడో సంభవించేది కాదు. మనిషి
మనిషిని మోసగించిన ప్రతి క్షణం నాకొక
యుగం ముగిసిపోయినట్టే ఉంటుంది. ఉజ్జ్వల
జీవితాశయాలతో వికసించవలసిన ఏ యువకుడైనా
వృద్ధుడిలాగా మాట్లాడినప్పుడు కాలం ఆగిపోయినట్టే.

పరిమళద్రవ్యాలు పరిమళహీనాలుగా మారే ప్రతి ఒక్క
క్షణం నాకు సృష్టి ముడుచుకుపోయినట్టే ఉంటుంది.

నువ్వొకణ్ణి ఎంతగానో నమ్ముతావు, వాడొక గోవులాంటి
వాడని తలుస్తావు. చూస్తూండగానే వాడు పులిలాగా
మారిపోతాడు. నీ కళ్ళముందే తప్పుడు తూకం
మొదలుపెడతాడు. చెయ్యవలసిన పని చెయ్యడం
మానేస్తాడు. ప్రేమారా పలకవలసిన నోటితో
శాపాలు కుమ్మరిస్తాడు. నీ ఎదట నవ్వుతాడు,
నీ వెనక వెక్కిరిస్తాడు. నిన్ను పైకెగరేసి
పట్టుకుంటానంటాడు. తీరా నువ్వు నేలమీద
పడే సమయానికి చేతులు తప్పిస్తాడు.

మనిషి తన ముఖం చూపడం మానేసి అసురముఖం
చూపినప్పుడల్లా వేడిగాడ్పు వీచినట్టనిపిస్తుంది
కళ్ళముందే చెరువులు ఎండిపోయినట్టుంటుంది.

ఆ క్షణం, నీ తోటివాడు, పైవాడు, పక్కవాడు
ఎవడన్నా కానీ, సురుడో, అసురుడో
పోల్చుకోలేకపోయినప్పుడల్లా నన్నొక
సముద్రకెరటం తాడించిపడేస్తుంది.

చూసాను అట్లాంటి క్షణాలు, లోకమంతా
ఏకార్ణవంగా మారి, దైత్యులకీ, మిత్రులకీ మధ్య
తేడాలు తుడిచిపెట్టుకుపోయిన క్షణాలు, సందర్భాలు–

నాకు తారసపడ్డ ప్రతి ఒక్క మనిషితోనూ
నేను తక్షణమే ప్రేమలో పడతాను, అపురూపమైన
ఒక లోకం, నేనెన్నడో పోగొట్టుకున్న లోకమొకటి
నా చేతులకు అందినట్టే అనిపిస్తుంది.
ఆ ఏదేను
ఉద్యానవనం, ఆ ఉత్తరకురుభూమి, ఆ పాలపళ్ళవాగు–
ఇంతలోనే ఏదో ముంచుకొస్తుంది, వాడు వాడు కాకుండా
పోతాడు. ఆమె ఆమె కాకుండా తప్పుకుంటుంది, సరిగ్గా
అట్లాంటి వేళల్లోనే మళ్ళా ఒక నిశీథి కమ్ముకుంటుంది
అయినా వాళ్ళని వదులుకోలేను,

But to what purpose
Disturbing the dust on a bowl of rose-leaves
I do not know[1]

ఒకసారి కాదు ఎన్నో సార్లు నా ఎదట లోకం
మరణించడం నేను చూస్తూనే ఉన్నాను, రంగులన్నీ
వెలిసిపోయి, కాంతులన్నీ మాసిపోయి, మనుషుల
వదనాలకీ, కథనాలకీ మధ్య పొంతన
చెరిగిపోయిన వేళ
నన్ను చుట్టు ముట్టిన సముద్రాన్ని
నేనెన్నిసార్లు ఈదానని!

అట్లాంటి ప్రళయాగమవేళ
దేవతలుండరు, దానవులుండరు
యక్షుల్లేరు, పక్షుల్లేవు, చెట్లు లేవు
పువ్వుల్లేవు.
నువ్వు నమ్మవు, నేను
తలదాచుకోడానికి ఇంత అంతరిక్షం లేదు.
ఒక భుజం లేదు, హృదయం లేదు
వణుకుతున్న నీ చేతుల్ని పట్టుకోడానికి
స్నేహస్నిగ్ధమైన మరొక మానవహస్తం లేదు.

మనుషులు మరణానికి భయపడతారు.
నేను మరణాన్ని చూసి కాదు, రిక్తహృదయాన్ని
చూసి భయపడతాను.

నిన్ను చూస్తున్న ఆ కళ్ళల్లో
చిన్నప్పుడు వీథరుగుమీద అమ్మ వెలిగించిన
సాయంకాలపు దీపం కనిపించకపోతే
ఆ నేత్రాలెందుకు? ఆ నేస్తాలెందుకు?

తోటిమనిషి నుంచి నాకు ప్రమాదముందనే
భయం లేదు నాకు, నేనూ, అతడూ కూడా
అంతరించిపోతామనే ఆందోళన అసలే లేదు.

నా వ్యథ ఒక్కటే
నాలో మనిషిని చూడనప్పుడల్లా
ఈ లోకం తన మానవత్వాన్ని
పోగొట్టుకుంటున్నదనే.

నేను ఉండీ నువ్వు మనిషిగా మనలేకపోతే
నా ఉనికికి అర్థం లేదు, నువ్వుండీ ఈ లోకం
లోకం కాకపోతే నా మనుగడకి ప్రయోజనం లేదు.

ప్రళయమంటే, సముద్రం
ముంచెత్తడం కాదు, నీ కోసం చాచిన
ఏ కరచాలనమైనా చేతికి చల్లగా తగలడమే.
మీరు పరస్పరం ఆలింగనం చేసుకున్నప్పుడు
ఒక పిచికలాగా గుండె
కువకువలాడకపోతే అది కల్పాంతమే.

నేనట్లా ఎంతకాలం గడిపానో తెలీదు, ప్రళయమంటే
సముద్రాలన్నీ ఒక్కటే కావలసినపనిలేదు
ఒక్కొక్కప్పుడు ఒక కన్నీటిచుక్క కూడా కడలిసమానం.
రూపురేఖలు చెరిగిపోయిన జగత్తులో
ఆ ఉప్పునీళ్ళమధ్య ఎన్నాళ్ళు ఈదులాడానో తెలీదు,
ఒక్క ఆశ్రయమేనా నన్ను పైకి తేలుస్తుందని
ఆశగా ఎదురుచూసాను.

మళ్ళీ ఎప్పుడొస్తాయి ఆ రోజులు, ఆ కాగితం పూలు
ఆ గాలిపటాలు, సంతలో కొన్న పంచదారచిలుక?
వర్షాకాలపు రాత్రుల్లో మంగలమ్మీద అమ్మ కాల్చిపెట్టిన
ఆ మొక్కజొన్న?

*జ్ఞాపకముందా నీకు?..*
*మన చిన్నతనంలో వసారాపక్క కాలువలో*

*వాననీళ్ళు వచ్చినప్పుడు కాగితాల పడవలు తయారు చేసి*
*వదిలిపెట్టే వాళ్ళం మనం:*
*అప్పుడు చిన్నతనం*
*లేపచ్చని నారుమడిలో చల్లగాలి...*
*అప్పుడు వెలిగించేవారు దీపాలు.*[2]

సరిగా అట్లాంటివేళ చూసాను, చూడటం కాదు
దర్శించాను,
 కళ్ళతో కాదు, నా సమస్త అస్తిత్వంతో
అనుభవంలోకి తెచ్చుకున్నాను, సరిగ్గా అరచేతిలో
పట్టేటంత విమలకాంతి, అన్ని చప్పుళ్ళూ అణిగిపోయినప్పుడు
మాత్రమే వినిపించే సుశబ్దం,
తప్పిపోయిన నా కోసం ఎక్కడో మరో వీథిలో
నోరారా పిలుస్తున్న మా అమ్మ పిలుపు,
ఆడుకుందాం రమ్మని పిలిచే ఒక బాలుడు,
తనతో తాను 'ఆడుకుంటున్న బాలిక'–

ఆ ఒక్కసారే కాదు,
నరోత్తమా,
 సరిగ్గా ఇదే నేను చెప్పాలనుకున్నదిదే:
ప్రళయం ముంచెత్తిన ప్రతి యుగాంతవేళా,
నాతో పాటు, వటపత్రప్రమాణంకలిగిన కించిదూర్జిత
స్ఫూర్తికూడా ఒకటి జీవించి ఉండటం కనుగొన్నాను

ఆ స్ఫూర్తి దానికదే ఒక లోకం
ఒకసారి నీకది తారసడ్డాక నీకు మరేదీ పట్టదు
మరిదేంతోనూ పనిపడదు.

ఎంత చిన్న వెలుగు! ఆ కాంతిలేశం నా కంటపడగానే
మళ్ళా కనిపించడం మొదలుపెట్టాయి హిమాలయాలు
మందరగిరి, మహేంద్రగిరి, మలయ, మేరుపర్వతాలు
మళ్ళా దృగ్గోచరమవడం మొదలుపెట్టాయి
చరాచరాలు, పారిజాతాలు, పులులు, పందులు కూడా.

శ్రీమంతమైన ఆ కాంతిపుంజం ఎదట నేనొక
బాలకుడిగా మారాను,
నాకు జీవితం మీద మళ్ళా ఆశ పుట్టింది
అప్పటిదాకా మునిగిపోయిన లోకాల్ని మళ్ళా పైకి లాగడం
మొదలుపెట్టాను
మళ్ళా ఒక్కొక్కరే వచ్చి పలకరించడం మొదలుపెట్టారు
దైత్యులు, ఆదిత్యులు.

మరణభయం ముందే లేదు
అప్పుడు నేను
ప్రళయభయం నుంచి కూడా బయటపడ్డాను.

ఎన్ని ప్రళయాలు సంభవించనివ్వు
ప్రతి యుగాంతవేళా నాతో పాటు
నవజీవనోత్సాహం కూడా నిలిచే ఉంటుందని గ్రహించాను.

20-8-2021

*1 టి.ఎస్.ఎలియట్: The Four Quartets, Burnt Norton*
*2 బైరాగి: నూతిలో గొంతుకలు, 3*

# నువ్వులేవు, నీ పాట ఉంది

జో ఖత్మ్ హెూ కిసీ జగహ్ యే ఐసా సిల్ సిలా నహీ
సాహిర్ లూధియాన్వీ

నువ్వు లేవు, నీ పాట ఉంది, నువ్వుండనీ, ఉండకపోనీ
నా బతుకంతా నీ సౌరభం నిండిపోయింది.

శిశిరం వస్తూనే వెళ్ళిపోయావు, వెళ్తూ వెళ్తూ నిత్య
వసంతాన్ని ఈ తోటకు వీలునామా రాసిచ్చావు.

ఇకనుంచీ ఆరు ఋతువుల్లోనూ నీ స్వరం కూడా
ఒక రంగు, తరగని వెలుగు, చెరగని తావి.

సూర్యచంద్ర నక్షత్రాలతో పాటు నీ పాటకూడా
నా ఆకాశమ్మీద అల్లుకునే రాధామనోహరంతీగె.

అలసిపోయాను అనుకున్నప్పుడల్లా నీ పాట తన కురులు
విరజార్చి నా వదనాన్ని కప్పేసే మేఘాల నీడ.

ఎందరో కవులు కన్న కలవి, ఒక జీవితకాలాన్ని
కొన్ని క్షణాలకు కుదించగల ఇంద్రజాలానివి.

నా గోదావరివి, కృష్ణవి, నా చిన్నప్పటి గ్రామానివి,
మాఘఫాల్గుణాల నల్లమలవి, వర్షర్తుదండకారణ్యానివి.

సగం రాత్రివేళ తారలు చెప్పే ముచ్చటవి, వెన్నెల రాత్రుల్లో
ఈ కొసనుంచి ఆ కొసదాకా సాగే పెళ్ళి ఊరేగింపువి.

సన్నాయివి, సుతారమైన సితారువి, గోధూళివేళ
ఆ అడవిలో నా మనసు చీల్చే మోహనశరానివి.

పొద్దున్నే వెలిగించిన పూజాదీపానివి, పీటని పల్లకీ చేసి
బొమ్మలపెళ్ళి ఆడుకున్న బాల్యకాల సఖివి.

వానపడకుండానే ఏర్పడే ఇంద్రధనుస్సువి,
ఎంత అమృతం కురిపించావు, అయినా తీరని దాహానివి.

మళ్ళా కలవకుండా వెళ్ళిపోయిన స్నేహితురాలివి, సరే,
నన్నెప్పటికీ వదిలిపెట్టని వాగ్దానానివి కూడా.

నీ గొంతు వినిపిస్తున్నంత కాలం ఈ శలభం
దీపంతో పనిలేకుండానే దగ్ధమవుతూంటుంది.

నలుగురు కవులు కావ్యగోష్ఠికి కూచునప్పుడు
నీ తలపు చాలు, వేరే దీపం సెమ్మెతో పనిలేదు.

8-2-2022

# హేమంతచంద్రిక

ఇరవయ్యో ఏడు నాకు మళ్ళీ
ఎలా వస్తుంది చెప్పు?

శ్రీశ్రీ

ఇవాళ తమ్ముడు పంపిన ఫోటో చూస్తుంటే
హేమంతచంద్రమా, మిత్రమా
నాకు అనిపించింది ఇదే:

ఇరవయ్యో ఏడు
నేను నిజంగా దాటిందెప్పుడని?

అప్పుడు ఆ చూపులు దేన్ని చూస్తున్నాయో
ఇప్పటికీ అటే చూస్తున్నాయి.
జీవితం పట్ల ఆ కుతూహలం ఇసుమంతైనా
చెదిరింది లేదు.

మధ్యలో ఎన్నో ఏళ్ళు గడిచాయి నిజమే,
ఎన్నో అనుభవాలు వరదలాగా
ముంచెత్తిపోయినమాటా నిజమే.
కానీ అవేవీ గుర్తులేవిప్పుడు,

గుర్తుకు రావడం లేదిప్పుడు.

ఇంకా నేను ఆ గోదావరి ఒడ్డునే ఉన్నట్టుంది,
నాలుగు కవితావాక్యాలు నెమరేసుకోడానికి
నలుగురి మిత్రుల కోసం
పరితపిస్తున్నట్టే ఉంది.

మాన్‌సూన్ గాలి తిరగ్గానే
గోల్డ్‌ఫ్లేక్ చిన్నసైజు సిగరెట్టు మీదకు
మనసుపోతూనే ఉంటుంది.

తెరచాప విప్పిన ఏ పడవని చూసినా
అవతలి ఒడ్డుమీంచి ఎవరో పిలుస్తున్నట్టే ఉంటుంది.

రసమయ కావ్యప్రపంచం ఎవరి దగ్గర ఉందని తెలిసినా
వెళ్ళి వాళ్ళ పాదాల దగ్గర కూచోవాలన్న కోరిక
అప్పుడెలా ఉందో ఇప్పుడూ అలానే ఉంది
ఇంకా చెప్పాలంటే మరింత బలంగా ఉంది.

మా ఊరిదగ్గర ఏటి ఒడ్డునో
గోదావరి గట్టుమీదనో
నలుగురు మిత్రుల్ని
కలుసుకోడానికి
సాయంకాలం ఎప్పుడవుతుందా
అని ఎదురుచూస్తున్నట్టే ఉంది.

ఆకాశంలో నువ్వు ఎప్పుడు కనబడ్డా
పాటలు పాడుకుందాం రమ్మని
ప్రతి ఇంటి తలుపూ తట్టాలనిపిస్తుంది.

నీతో మాట్లాడుతూనే ఉన్నానుగాని
ఇప్పటికీ ఆ అస్పష్ట స్వప్నసుందరికోసం
హృదయం నలుదిక్కులా గాలిస్తూనే ఉంది.

నా ఉత్తరాలకి ఆమె జవాబు కోసం
పోస్ట్ మేన్ ఎప్పుడొస్తాడా అని
రోజూ ఎదురుచూస్తున్నట్టే ఉంది.

గుర్తుందా, ఆ నవంబరు రాత్రి
రెండెడ్ల బండిమీద ధాన్యం మూటలు గట్టుకుని
తాళ్ళపాలెం నుంచి ఇంటికి వచ్చిన రాత్రి
హేమంత చంద్రమా, మిత్రమా
నువ్వూ నేనూ కలిసి పయనించామే
ఆ ప్రయాణమింకా కొనసాగుతూనే ఉందనిపిస్తుంది.

ఈ ప్రపంచంలో ఈ అన్యాయం
ఈ అసమానతలు
ఉండకూడదనే ఆ అమాయికమైన కోర్కె
అప్పట్లానే ఇప్పుడూ
జ్వాలలాగా లోపల మండుతూనే ఉంది.

ఎన్ని చెప్పు,
ఈ ప్రపంచం ఇంతే, ఇలాగే ఉంటుందని

ఇన్నేళ్ళయినా, ఎందుకో, ఇంకా
సరిపెట్టుకోలేనితనం
అప్పుడెలా ఉందో ఇప్పుడూ అలానే ఉంది.

ఈ ప్రపంచం మారాలనీ, మార్చాలనీ
ఆ మాటలేవీ నాకు చాతకాదు గానీ
అప్పుడూ, ఇప్పుడూ నాకెందుకనో-
నలుగురు మనుషులు కలిసినప్పుడల్లా
ఒక కుటుంబం కలుసుకున్నట్టుగా ఉండాలనిపిస్తుంది.

*5-12-2022*

## ఇంకా తెల్లవారని వేళ

అయిదో అంతస్థులో ఉన్న నీగదిలోకి
నీళ్ళు ప్రవహించినట్టు
వేపపూల గాలి.

కిటికీ తెరుస్తావు.

కాలనీ మొత్తం నిద్రపోతూ ఉంటుంది.
నిద్రపోతూనే గోదావరిలో
తేలిపోతున్న గ్రామంలాగా.

గట్టిగా ఊపిరి పీలుస్తావు.

ఇదొక చిత్రమైన మునక.
ఎంతలోతుగా మునిగిపోతూ ఉంటే
అంతలా పైకి తేలుతుంటావు.

16-3-2023

# కుహూరవం

This February was the hottest in India since 1901, the earliest year for which data is available.

The Hindustan Times, 1 March 2023

నా ఎదుట ఉన్న ఫోటోలో
చిన్నప్పటి ముఖాన్ని వెతుక్కున్నట్టు
ఈ మార్చి ఎండలో
ఒకప్పటి వసంతాన్ని పోల్చుకుంటున్నాను.

ఒక కోకిల ఇంకా రాకపోవడానికి
నాతో పాటు సమస్త ప్రపంచం
కారణమని తెలుసుకున్నాక–

చెట్లు చిగురించనిలోకంలో
నేనే చిగురించాలని తెలుసుకున్నాను.
కోకిల ఎక్కడుందో పిలవడానికి
నేనే ఒక కుహూరవంగా మారుతున్నాను.

వేడెక్కుతున్న భూమిని
నేనిట్లా చల్లపరచడం మొదలెట్టాక

నా దారిన వన దేవతలు కూడా
నడక మొదలు పెడతారు.

30-3-2023

# ఆ ఒక్క క్షణమే

సగం తవ్విపోసిన ఇనుప ఖనిజంలాగా
సికింద్రాబాదు రైల్వేస్టేషను.

ఎండిపోతున్న గోతుల్లోంచి
పెల్లుబేగిన ఈగల్లాగా
బిలబిల్లాడుతూ మనుషులు.

పెట్టెలు మోసుకుంటూ
మెట్లు దిగుతుండగా
ఎక్కణ్ణుంచో
తొలి కోకిల పిలుపు.

ఆ ఒక్క కూజితం
క్షణంలో
ఆ రైల్వేస్టేషన్ని మాయం చేసేసింది

ఎటు చూడు విరబూసిన బూరుగచెట్లు,
తేనెలు రాలుతున్న పూలు.

ఆ ఒక్క క్షణమే.

మళ్లా నా చుట్టూ ఖణేల్మంటూ హోరన్లు
దారిపొడుగునా ఉమ్ములు.

*30-3-2023*

# దేవతగా మారిన కవయిత్రి

దేవతగా మారిన కవయిత్రి ఇంట
అడుగుపెట్టాను లేదో ఆమె
'నీతో కొంత చీకటి పట్టుకొచ్చావు
దాన్నక్కడే వదిలిపెట్టి రా' అంది.

నేనన్నాను కదా! 'అమ్మా!
ఎంతో కొంత చీకటి లేకుండా
మనిషి కవిగా ఎలా మారతాడు
నువ్వు దేవతగా ఎలా మారావు?'

ఆమె నాకు చెప్పిన మాటలు
ఒక్కసారిగా అర్థమైనవికావు
విన్నవాటిని ఒక్కటొక్కటిగా
నెమరేస్తూ నే తెలుసుకున్నదిది:

వేదనలేక కవిత్వం లేదు
వేదన లేక బతుకు లేదు
చీకటి వెలుగుగా మారినట్టు
వేదన కవితగా మారుతుంది

తపించు, దుఃఖించు, సంఘర్షించు
అనుభవించు, ఆత్మలో నిరాకరించు.
ఏ క్షణం కూడా ఆగకు చీకటి దగ్గర
నీ వెంట మోసుకుపోకు, తీసుకురాకు.

కిందకు దిగులాగుతుంది వేదన
ఓపిగ్గా నిన్ను పైకి లేపుకోవాలి
ఎప్పటికప్పుడు నిన్ను నువ్వే
నీ చేతుల్తో పైకెగరేసుకోవాలి.

వేదనతో అలసి సొలసిన ప్రతిసారీ
అదే నిజం కాదని చెప్పుకోవాలి.
ఆగ్రహం, అవమానం, ఈసు-
ఈ పంకంలోనే పద్మం వికసించాలి.

అయినా ఆమెనింకో ప్రశ్న అడిగాను
'అమ్మా, మనిషిగా పుట్టినందుకే కదా
వేదన పడ్డావు, పద్యం చెప్పావు
మరి దేవతగా ఎందుకు మారావు?'

'మనిషిని కాబట్టి దుఃఖం తెలిసింది
దుఃఖం దాటగానే దేవతనయ్యాను.
ఒకసారి ఈ విద్య పట్టుబడిందా
ఇక నువ్వెటు నడిస్తే అటు వెలుగు.'

*25-3-2023*

## భగవంతుడి చూపులు

భగవంతుడి ఎదుట నిలబడ్డప్పుడు
అన్నిటికన్నా ముందు
నన్ను నిలువెల్లా కట్టిపడేసినవి
భగవంతుడి చూపులు.

ఆ చూపులకు అర్థం ఇదీ అని
స్పష్టంగా చెప్పుకోలేననిపించింది.
నిశ్చితమైన ఏ అర్థానికీ
వాటిని నేను కుదించలేననిపించింది.

ఆ చూపులు నేలమీద లేవు
వాటి దృష్టి నింగి పైన కూడా లేదు.
అవి బయటకు చూడటం లేదు
లోపలకి సారించినవీ కావు.

ఆ చూపులు నీ వైపు చూడాలని
అనుకుంటూనే ఉన్నావా
అవి నీ వైపు ప్రసరించడం కాదు
నిన్నే తనలోకి లాక్కుంటున్నవి.

ఆ తలపుల్లో నేనున్నానని
నాకు తెలుస్తున్నది కానీ
ఆ నేను నేనుగా మిగలకుండా
నన్ను తమలో కలుపుకుంటున్నవి.

ఆ చూపులు ఎటు చూస్తున్నవో
ఆ తావుకు సాగలేను, ఎగరలేను
వాటి ముందు ఎంతసేపు నిలబడ్డా
ఎంతకీ తనివి తీరదనుకున్నాను.

కొండల వరస లాగా నీలి కడలి లాగా
నీలాకాశం అద్దంలా నిలబడ్డట్టుగా
అవి నీవైపు నడిచి రావటం కాదు
నిన్నే తమవైపు రమ్మంటున్నవి.

ఆ చూపులు చూసే దిక్కు చేరటానికి
ముందుకో వెనక్కో నడిస్తే చాలదు.
నువ్వు లేకుండా ఉండగలిగినప్పుడే
వాటి ఎదుట నిలబడగలమనిపించింది.

ఎంత ప్రయత్నించు భగవంతుడి చూపుల్ని
మరే భావంతోనూ పోల్చలేకపోయాను.
భగవంతుడి చూపుల్ని భగవంతుడి చూపులని
గుర్తుపట్టాను, మరింకేం కావాలనిపించింది.

*24-3-2023*

## ఆమె ఆలపించడం మొదలుపెడుతూనే

ఆమె ఆలపించడం మొదలుపెడుతూనే
ఒక లాండ్ స్కేప్ దగ్గరగా జరిగినట్టుంది.
చెట్లు చిగురించే దేశాల వార్తల్తో ఎవరో
ఇప్పుడే హుటాహుటిన బయల్దేరినట్టుంది.

ఆమె తొలి చరణం మొదలుపెడుతూనే
మేతకు పోయిన తల్లిని వెనక్కి పిలిచినట్టు
పల్లెలో నీ పాత ఇంటి పసులకొట్టం లోంచి
ఒక లేగదూడ అంబారవం చేసినట్టుంది.

ఆమె చివరి చరణానికి చేరుకుందోలేదో
తప్పిపోయిన పిల్లలు వెనక్కి వచ్చినట్టుంది.
పాట పూర్తవుతూనే నీ పాతమిత్రులు
బిలబిల్లాడుతూ నీ చుట్టూ చేరినట్టుంది.

*23-3-2023*

## నా కవితలూ, నా పాఠకుడూ

వందేళ్ళకిందట పూర్వకాలపు కవులు
పద్యాలు రాసుకున్నప్పుడు
ప్రపంచమంతా వాటిని ఎలుగెత్తి
పాడుకుంటుందనుకున్నారు.

శత, సహస్రాధికంగా మనుషులు
వాళ్ళతో పాటు పుట్టారు, పెరిగారు
ఆ కవులూ ఆ కవితలూ తెలియకుండానే
ఈ లోకం నుంచి నిష్క్రమించారు.

ఆ కవులూ వెళ్ళిపోయారు,
వాళ్ళ కవితల్నిక్కడ వదిలిపెట్టి.
ఆ పద్యాలు నా చేతుల్లో పడ్డప్పుడు
అవి నాకోసమే రాసారనుకున్నాను.

నా కవితలూ అంతే-
వందేళ్ళ తరువాతైనా ఎవరో ఒకరు
ఆ తలుపు తెరుచుకు లోపలకొచ్చి
అక్కడ కొంతసేపు గడిపివెళ్తారు.

18-3-2023

# కొత్తరోజు

మనిషి నడుస్తున్న చెట్టు కనుకనే
చెట్లు చిగిరించే వేళల్లోనే
తనకీ కొత్త ఏడు
మొదలవుతున్నది.

మనిషి మాట్లాడే పక్షి కనుకనే
కోకిల ప్రవేశించే కాలంలోనే
కొత్త ఏడు
కనిపిస్తున్నది.

మనిషి కొంత చెట్టూ
కొంత కోకిలా కనుకనే
కొత్తరోజు మొదలవుతూనే
అప్రయత్నంగా చిగురిస్తుంటాడు
గొంతు సవరించుకుంటాడు.

*22-3-2023*

# తన ధ్యాసంతా

అజ్ఞాత వాసంలో ఉన్న చిత్రకారుడెవరో
తన తైలవర్ణాలిక్కడ దాచుకున్నట్టుగా
కొంత పసుపు, కొంతతెలుపు, కొంత ఎరుపు
ముద్దగా మూటగట్టుకున్నట్టు ఒక మొగ్గ.

సూర్యతాపానికి కరుగుతున్న బంగారం
పిడికెడు పువ్వుగా మారడం మొదలుపెట్టాక
ఎలా పోతపోసారో తెలియదు, ప్రతి రేకలోనూ
చోళకాల దేవతాశిల్పాల అనితరసాధ్యవక్రత.

ఎండకి వెనక్కి ముడుచుకుంటున్న నీడల్లో
ఆకుల గుబుర్లలో ఒదిగి కూచున్న ఓరియోల్.
గొంతులోంచి వికసిస్తున్న పాటని పరిమళంగా
మార్చుకోడం మీదనే ఇప్పుడు తన ధ్యాసంతా.

*3-4-2023*

# చెట్లు మేలుకునే దృశ్యం

ప్రభాతం తూర్పుదిక్కున అని అనుకోవడం ఒక నమ్మకం,
సోమరి అలవాటు. చెట్లు మేలుకునే దృశ్యం చూసాక
తెలుసుకున్నాను: అరణి రాపాడించి ఋషులు అగ్నిని
పుట్టించినట్టు పక్షులు ప్రభాతాన్ని మేల్కొల్పుతాయని.

కార్తికప్రత్యూషాల్లో దీపాలు వెలిగించి నదిని మేల్కొల్పినట్టు
ప్రతి పండగా ముందు గుడిమల్కాపూరు పూలమండిలోనే
మొదలైనట్టు, తెలతెలవారేవేళ పెళ్ళివారి విడిదిముందు
సన్నాయిమేళం వినబడగానే ఉత్సవసౌరభం వ్యాపించినట్టు-

చెట్లు మేలుకునే ఏకాంతవేళ సూర్యుడు భూమికి దగ్గరవుతాడు
అప్పుడు ప్రతి కొమ్మలోనూ, ఈనెలోనూ, వేర్లనుంచి పూలదాకా
వెలుగు తయారవుతుంది. పూర్వకాలపు సమష్టికుటుంబాల్లాగా
ఒకరు లేవగానే అందరూ లేస్తారు, పల్లె మొత్తం మేలుకుంటుంది.

5-4-2023

# రమణీ ప్రియదూతిక

సిమెంటుకాంక్రీటు నగరం మీద
సుత్తితో మోదుతున్నది కోకిల.
నగరాన్ని నిరుపహతి స్థలంగా మార్చడానికి
నాకు తెలిసి మరో దారి లేదు.

మొదటికూతతోనే ఈ నగరాన్ని
పక్కకు నెట్టేస్తుంది.
ఎవరూ బద్దలుకొట్టలేని అద్దాలతో
పద్యాలనగరాన్ని పైకి లేపుతుంది.

తనకు తనే ప్రతిధ్వనిగా
తనకు తనే ప్రతిబింబంగా-
ఈ రమణీప్రియదూతిక
తనకు తనే కప్పురవిడెమందిస్తుంది.

17-5-2023

## పూలప్రళయం

మిట్టమధ్యాహ్నం దారిపొడుగునా పెద్ద వరద.
కొన్ని వేల దీపాల్ని ఒక్కసారి వెలిగించినట్టు
ఎటు చూడు తురాయిచెట్లు. పట్టపగలే అంత
వెలుతురు ప్రవహిస్తుంటే చూడటం సులువు కాదు.

నా చిన్నప్పుడు మా ఊళ్ళో వానాకాలం ఏరు
పొంగినప్పుడిలానే కొమ్మలూ, పూలూ కొట్టుకొచ్చేవి.
అన్ని పనులూ వదిలిపెట్టి ఊళ్ళో వాళ్ళంతా
వరద తగ్గేదాకా అక్కడే నిలిచిపోయి చూస్తుండేవారు.

ఇప్పుడు ఈ ఎర్రటిపూలవెలుగులో కొట్టుకుపోతున్న
వాహనాలు, భవనాలు, పట్టణాలు, పాదచారులు.
సమస్తప్రపంచాన్నీ పూలప్రళయమిట్లాముంచెత్తాక
చూడటానికి ఎవరూ మిగల్లేదు, ఎక్కడా చోటులేదు.

17-5-2023

# ప్రేమ మరక

రోహిణికార్తె చివరిదినాలు.
పొద్దున్న పదిగంటలకే
ఫైరింజనువాళ్ళ సైరనులాగా ఎండ.

పంచాగ్నిమధ్యంలో
సంగీత సాధనచేస్తున్నట్టు
పచ్చపూల చెట్టు.

ప్రాక్టీసు చేసిన పాటలన్నీ గాల్లో కలిసిపోయాక
చివరి రాగంలాగా
వెచ్చని పరిమళం.

నీడల్ని పీల్చుకుంటున్న కొమ్మల మధ్య
చిట్టచివరిపూలూ పిట్టలూ
కూడబెట్టుకున్న తేనె.

ప్రేమించినవాళ్ళు వెళ్ళిపోతూ
వదిలిపెట్టిన ప్రేమమరక.
ఎంత రుద్దినా చెరగని కస్తూరి.

*5-6-2023*

## తెల్లవారకుండానే

తెల్లవారకుండానే
పక్షులు చెట్టుతో పాటు
నన్నూ లేపుతుంటాయి

అప్పుడు నేనొక తల్లిగా మారిపోతాను.
కిటికీదాటి నా చీరచెరగు
చెట్టుమీద పరచుకుంటుంది.
నా వక్షంలో పాలు పొంగడం మొదలవుతుంది.

తెల్లవారుతుంది.
చిన్ని చిన్నినోళ్ళతో పిట్టలు
బంగారం కొరికి పడేస్తుంటాయి

వాటికి కావలసింది
పూల గిన్నెల్లో మెరిసే చిన్ని తేనెబొట్లు.

పొద్దెక్కేటప్పటికి
నేను చెట్టుగా మారిపోతాను

చిన్ని చిన్ని ముక్కుల్తో
అవి నన్ను పొడిచినచోటల్లా
పచ్చని కితకితలు.

*6-6-2023*

# ఉండీ ఉండీ కోకిల అరుస్తుంటుంది

ఉండీ ఉండీ కోకిల అరుస్తుంటుంది.
ఆ అరుపు విన్న ప్రతిసారీ సముద్రం
ఉలికిపడుతుంది.

గోరువంకలు రోజంతా పూలముందు
పడిగాపులు పడతాయి, కాని
కరుణించాల్సింది ఆకాశం.

ఈ నగరవృక్షానికి సిమెంటుకాంక్రీటు
ఎరువుపెడుతూనే వున్నారు,
ఇప్పుడు నీళ్ళు కావాలి.

ప్రతి ఏటా ఇదొక చిత్రమైన కాలం,
ఎంతచెప్పు, ఒక్క మేఘం తప్ప మరేదీ
అక్కర్లేదనిపిస్తుంది.

ఎండిబీటలు పడ్డావని దిగులు
పడకు, తొలకరిచినుకు పడగానే
మట్టిపువ్వై పరిమళిస్తావు.

9-6-2023

## వానకి తడుస్తున్న చెట్లు

నీటిరంగుల చిత్రకారుడు
రంగుల్ని పళ్ళెంలో కాకుండా
కాగితం మీద కలిపాడు.

తన మనసులో కనిపిస్తున్న ఆకృతుల్ని
కాగితం మీదకి తీసుకురమ్మని
రంగుల్నీ, నీళ్ళనీ
ప్రాధేయపడ్డాడు.

ఎన్నాళ్ళుగానో, ఎన్నేళ్ళుగానో
గడ్డకట్టిన తాపమంతా
కరగడం మొదలుపెట్టింది.

కాగితం మీద నీళ్ళు
పరుచుకోడం మొదలుపెట్టగానే
పైన విస్తరించిన వెలుగుని
ఆకాశం అనుకున్నాడు.

దానికింద పరుచుకున్న నీడలు
కొండలూ, కాలువలూ అనుకున్నాడు.

ఆ మధ్యలో అక్కడక్కడ
రంగు ముద్దగా పడి
నిలిచిపోయిన తావుల్ని కొంతసేపు
తదేకంగా చూసాడు.

చీకటీ, వెలుగూ
అల్లుకున్న ఆ తావుల్లో
వానకి తడుస్తున్న చెట్లని
గుర్తుపట్టాడు.

బొమ్మ పూర్తయ్యింది.

27-7-2023

## గాలిపటాల ఋతువు

చెట్లు చిగిరించే
కాలంలాగా
ఈ నగరంలోకి
గాలిపటాల
ఋతువొచ్చింది.

పల్లెల్లో బంతిపూలు,
దారి పక్క గొబ్బిపూలు
ఇళ్ళ కప్పుల మీద
పండుగుమ్మడిపూలు
పూసినట్టు–

ఈ సాయంకాలం
నగరాకాశం మీద
గాలిపటాలు
విరబూసాయి.

ఎక్కడికక్కడ
ఫౌంటెన్లు తిప్పినట్టు

పసుపు, గులాబి, ఊదా
రంగుల తునకలు.

ఎగురుతున్న గాలిపటాల
దారాలకు తగులుకుని
భవనాలు కూడా
గాల్లోకి లేచిపోతున్నాయి.

ఇలాంటి మాజిక్ షో
నేనిప్పటిదాకా చూడలేదు.

ఇప్పటిదాకా ఉండలాగా
నన్ను చుట్టుకున్నదేదో
వదులవుతూ–

నేను కూడా
తేలిపోడం మొదలుపెట్టాను

14-1-2024

# పాడకుండా ఉండలేని పాట

ఒక రాత్రి నామదేవుడితో కలిసి పాండురంగడు తుకారాం కలలో అడుగు పెట్టాడు. అతడి ముందు తక్కెడ చాపాడు. ఒకవైపు సిబ్బెలో నామదేవుడు కోటి కీర్తనలు పోగు పోశాడు. 'అయినా ఇంకా బాకీ తీరలేదు, మిగిలిన పాటలు నువ్వు పాడు' అని అన్నాడట విఠలుడు తుకారాముతో.

పొద్దున్న ఆ పుస్తకాల షాపు లో
అడుగుపెట్టానో లేదో
నా మీద వలవిసిరింది మామిడి చెట్టు.

ఊపిరి ఆడనివ్వకుండా
ఒళ్లంతా వెయ్యి చేతులతో
చుట్టేసింది పుప్పొడి.

ఏదీ! ఇప్పుడొక కవిత రాయి
అని అడిగావు నువ్వు.

తేరుకోవడం చాలా కష్టమైంది.
నీకు తెలుసు కదా
నేనీ సంతోషాన్ని
స్వీకరించే స్థితిలో లేనని.

ఇంకా ఏ పాటలు
మిగిలిపోయాయని
ప్రభో!

నువ్విట్లా
నా మెలకువ లోనే
నా వెంటపడుతున్నావు?

2-2-2024

# మరీ ముఖ్యంగా ఈ మాఘమాసం

మొన్న బుక్‌ఫెయిర్‌కి వెళ్ళినప్పుడు ఒక పుస్తకాలషాపు దగ్గర నిలబడి పుస్తకాలు చూస్తూ ఉంటే ఒక చిన్నపిల్ల పలకరించింది. 'సార్, మీరు మా స్కూలు పండక్కి వచ్చారు కదా' అనడిగింది. నిజమే. నేను వాళ్ళ స్కూలు యానివెర్సిరీకి వెళ్ళాను. అక్కడ ఆ పిల్లలు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్లో ఆ అమ్మాయిని పలకరించాను. బహుశా ఒక నిమిషం పాటు మాట్లాడి ఉంటాను. లేగదూడ తల్లిని గుర్తుపట్టినట్టు ఇప్పుడు ఆ బిడ్డ అంత జనసమ్మర్దంలో నన్నెట్లా గుర్తుపట్టిందా అని ఆశ్చర్యపోయాను.

ప్రతి మాఘమాసంలోనూ
నన్ను మంకెనలు పలకరిస్తాయి.

సూర్యుడికి ధూపం చల్లినట్టు
విరబూసిన మామిడిపూత మధ్య
సూర్యస్తోత్రాలు పఠించడం
మొదలుపెడతాను.

ప్రతి దినాంతసంధ్యవేళా
మరీ ముఖ్యంగా
ఒక మాఘమాసపుగాలి
నా ప్రాణాలు తోడేస్తుంది.

కాని ఈ మాఘమాసం
నన్ను తల్లకిందులు చేస్తున్నది
పువ్వులు కాదు
పిల్లలు.

ఏ పిల్లవాడి గురించి విన్నా
ఏ పిల్ల పలకరించినా
కన్నీళ్ళు పొంగుకొస్తున్నవి.

బతకవలసింది వాళ్ళు.

జీవనఫలాన్ని ఇంకా మునిపంట కూడా
కొరికిచూడని
ఆ పిల్లలు–

క్లేశరహితంగా
ఉండాలన్న కోరిక ఒక్కటే
నా ప్రాణం నిలుపుతున్నది.

21-2-2024

# నువ్వొక చాతకం కావాలేగానీ

అప్పుడు రోజూ అనుకునేవాణ్ణి
ఆ కొండవార, ఆ అడవిలో నునువెచ్చని
ఆకుపచ్చదనం
అల్లుకుంటూ ఉంటుందని.

ఇప్పుడు అవనినీ, ఆకాశాన్నీ
ఆక్రమించిన చల్లదనం.

మనుషుల్తోనూ, నగరంతోనూ
పనిలేకుండా చెట్లకీ, కోకిలకీ
మధ్య నడుస్తున్న సంభాషణ.

కొన్నాళ్ళు పక్షిగానూ, కొన్నేళ్ళు
సస్యంగానూ జీవించిన జ్ఞాపకాలతో
ఆ మాటల్ని గుర్తుపడుతున్నాను.

ఇన్నాళ్ళూ ఒక స్నేహంకోసం,
ఒక స్పర్శకోసం
ఓదార్పుకోసం వెతుక్కుంటూ గడిపాను.

ఇప్పుడు చాతకం నిద్రలేపి మరీ అడుగుతున్నది
ఆకాశవేదిక పైన సరికొత్త రూపకం మొదలయ్యింది
చూసావా అని.

మామూలు ప్రదర్శనల్లాగా
ఇది తెరతీసాక మొదలయ్యేది కాదు.

నల్లని మబ్బుతెర వెనక
ఆరని వెండివెలుగులో
ఏం నడుస్తుందో తెలియదు కానీ
మనసంతా ఒక పులకింత.

అర్థమయ్యింది:
నువ్వొక చాతకం కావాలేగానీ
ఏకంగా సముద్రమే
నిన్ను వెతుక్కుంటూ రాగలదు.

ఒక్కొక్క కాలంలో
ఒక్కొక్కరు ఆరాధనీయులవుతారు.
ఇప్పుడు చాతకం నా ఆదర్శం.

ఏమి చేస్తే
నేనొక చాతకాన్నీ, చకోరాన్నీ కాగలనా
అన్నది ప్రస్తుతం నా తపస్సు.

9-6-2024

# ఆ ఉత్తరం

ఆషాఢ ప్రథమదివసం నాడు
ఒక నది ఒడ్డున నిల్చున్నాను
ప్రతి ఏడూ ఈ మొదటిరోజున
నాకోసం ఒక ఉత్తరమొస్తుంది.

రేవునిండా కిక్కిరిసిన జన
సందోహం. ఒక్కళ్లకీ తెలీదు,
ఇప్పుడిక్కడ మేఘమొక
వుత్తరం జారవిడుస్తుందని.

చూస్తూండగానే ఎక్కడికక్కడ
నింగినిండా పైకెత్తిపట్టుకున్న
లాంతర్లు. అర్థమయింది, ఆ
ఉత్తరం కింద చదువుకునేది కాదు.

7-7-2024

## ఇంకా తెల్లవారకుండానే

ఇంకా తెల్లవారకుండానే
కొలిమి రగిలిస్తుంది కోకిల.

తన గొంతు ఒక తిత్తిగా ఆ
ఊదడానికి అంతే ఉండదు.

కమ్మరి వీరాసామి కొలిమి దగ్గర
రైతులు చేరుకున్నాక, గుర్తుందా!

చాలాసేపటిదాకా ఒక వైపు పని
మరోవైపు పిచ్చాపాటీ.

అప్పటికి మంట చల్లారుతుంది
అంతసేపూ ఊదినందుకు-

ఎటుచూడు నింగినిండా
బూడిదరంగు మబ్బులు.

11-7-2024

## నారుమడిపొయ్యడానికి

నారుమడిపొయ్యడానికి
నీళ్ళు పట్టిన పొలంలాగా
పరుచుకున్నది మబ్బు.

అందరికీ అది నల్లగా
కనిపిస్తుండవచ్చు.

నాకు మాత్రం
లేతాకుపచ్చ.

13-7-2024

## పొద్దుణ్ణుంచి చూస్తున్నాను

నాచిన్నప్పుడు
మా కొ్రావు నేడో రేపో
ఈనుతుందనగా
మా అమ్మ
మనసు మనసులో ఉండేది కాదు.

ఇంటిపనులు చేస్తుండేది
వండేది, వడ్డించేది
ఇంటికొచ్చినవాళ్ళని
పలకరించేది–

అయినా ప్రతి ఒక్కరికీ తెలుస్తుండేది
ఆమె మనసు మనసులో లేదని.

ఆమె హృదయం కంపిస్తున్నదని
పక్కింటివాళ్ళకి కూడా తెలిసేది.

ఇళ్ళల్లో పొయ్యి వెలిగించుకుంటూ
వాళ్ళల్లో వాళ్ళు చెప్పుకునేవారు:

ఆ కన్రావు ఎంతబాగా
చూడు కట్టిందీ అని.

పొద్దున్నే పొలానికి వెళ్ళిన
రైతులు కూడా
పని మధ్యలో
ఉన్నట్టుండి ఎవరో తమని
పలకరించినట్టు
చూపులు ఊరివైపు తిప్పేవారు,

ఈ పాటికి వాళ్ళింట్లో
కన్రావు ఈని ఉంటుందనుకునేవారు.

పొద్దుణ్ణుంచి చూస్తున్నాను
వాన పడుతుందంటే
అదేమిటో–

కోయిలకి కూడా
మనసు మనసులో లేదు.

15-7-2024

# పొద్దున్నే నగరాన్ని

పొద్దున్నే నగరాన్ని  నిద్రలేపుతున్నాయి ప్రార్థనలు
కాని దేవుడి దృష్టి కోకిల పిలుపుల మీద ఉంది.

ఆయనకు చెప్తున్నది కోకిల
నన్ను చూపిస్తో:

'ఇదిగో! అతనిగుండె,
ఎక్కడో పారేసుకున్నాడు,
ఇప్పుడు దొరికింది.'

21-7-2024

# చిత్రగ్రీవం

> Strange nightingale whose mouth is open wide
> To fit both thorns and roses now inside!
>
> Rumi (Masnavi, 1:1582)

నోరారా ఎలుగెత్తి పిలుస్తున్నప్పుడే
అనుకున్నాను-

ఆ కోకిల తన గొంతులో
పూలూ, ముళ్ళూ
రెండూ పొదువుకుందని.

పూలు సరే, రంపం పళ్లలాంటి
ముళ్ళెందుకని ఆ గొంతులో?

కొడవలి కక్కుల్లాంటి
ఆ కూజితాలు వినగా వినగా-
మిత్రలాభకథ
కొత్తగా వినిపిస్తున్నది.

నేనిరుక్కున్న వలతాళ్ళు
ఈ చిత్రగ్రీవం
తనే కొరికి తెంపుతున్నది.

16-7-2024

# పట్టపగలే ఆకాశానికి

పట్టపగలే ఆకాశానికి అడ్డంగా తెర వేసారు
ఇక రాత్రింబవళ్లు యక్షగానం నడుస్తుంది.

కావటానికి ప్రతి యేటా కొత్త జలతారుతెర,
అయినా అదేమిటో!  అంతులేని కంతలు.

17-7-2024

# ఆమె తన కొంగున

ఆమె తన కొంగున నిప్పు కట్టుకుంది
అన్నాడు ద్రౌపదిని మహాకవి.

కోకిల కూడా అంతే! నా దుఃఖం
తన గొంతున మూటగట్టుకుంది.

18-7-2024

## తలుపులు మూసేసినట్టు

తలుపులు మూసేసినట్టు నింగి పొడుగునా మబ్బు
మళ్లీ ఇంతలోనే బార్లా తెరుచుకుంటున్న తలుపులు.

దిగంతం దాకా తెరుచుకున్న రన్ వే మీద విమానాలు
నింగి నించి  ఎక్కడికక్కడ జారవిడిచిన నిచ్చెనలు.

19-7-2024

# తాళ్లు కట్టి మరీ

తాళ్లు కట్టి మరీ ఈ నగరాన్ని మేఘాలు
ఎక్కడికో తరలించుకుపోతున్నవి.

పల్లెల్లో పిల్లలు బస్సు వెనుక పరిగెత్తినట్టు
కోకిల ఒకటే కేరింతలు కొడుతున్నది.

20-7-2024

# పాట పాడే ఇప్పచెట్టు

కొంతకాలము కింద నేనొక
కొండదారిన కలుసుకొంటిని
పాట పాడెడి ఇప్ప చెట్టును,
చూసి పరవశమొందితిన్.

ఆకు రాలని పూత తరగని
ఇంద్రజాలము తరువిలాసము.
కట్టివైచెను చెట్టు తనకడ
ఆరు ఋతువులనొక్కెడన్.

కానలందున కోనలందున
కల్లలెరుగని పిల్లలందున
మారుమోగెడి రాగసౌరభ
మా మధూకపరాగమే!

బతుకు బరువై బాధ ఘనమై
దిక్కుతోచని చిక్కు దినముల
తలతు నేనా తీపి తావుల,
తలచి తేలిక నొందుదున్.

ఆకసమ్మున తారకలకై
చంద్రుడొక్కడె చాలినట్టుల
కలతతీరదె కవిగణమ్ముకు
గౌరునాయుడు పూయగా!

8-8-2024

## ఒక కార్తిక అపరాహ్ణం

లేదు, పదాలట్లా ఎంతసేపని నిన్నే చూస్తుంటాయి
నువ్వు వెతుక్కుంటున్నదాన్ని
అవి ఒంటరిగా వెతకలేవు.
వాక్కుని వాక్యాలుగా చూడాలనుకోడం
పాతకాలపు చదువు.
అది సరిపోదు, నీ అనుభవాలు మరీ బరువు.

రాషిద్‌ఖాన్ చూడు, ఆలపిస్తున్నాడొక కీర్తన
పదాల్ని వాక్యాలుగా కాదు
పరిమళంగా మార్చేస్తున్నాడు.

రాత్రి గడిచేకొద్దీ దీపకాంతి మందగించినట్టు
కోవిదారవృక్షం మీద
వెలిసిపోతున్న శరత్కాలం.

మొన్నటిదాకా ఆ నది ఒడ్డున రెల్లు పూస్తుంటే
నువ్విక్కడే ఉండిపోయేవనుకున్నావు
కొండ కింద పల్లెలో ఉండవలసినవాడివి
మార్కెట్ పక్క ఇంట్లో ఉంటున్నావు, నిజమే.
కాని ఒక్కసారి మ్యూట్ బటన్ నొక్కి చూడు

చిట్టచివరి పున్నాగపూల గాలి
గుసగుస వినబడుతుంది.

ఇప్పుడక్కడ పొలాల్లో పంటకోతలు మొదలవుతాయి
ఒకసారి గ్రామాల్లో హేమంతం అడుగుపెట్టాక
తూనీగల రెక్కలమీద పరుచుకునే బంగారపు దుమ్ము.
నువ్విక్కడ కీట్సుని తిరగేస్తూ
పాపం, ఎన్నాళ్ళని గడుపుతావు!

పగలు వెన్నెలగా మారిపోయే పొలిమేరల్లో
ఆ ఏటిమీద వంతెన కింద
నీ చిన్నప్పటి పాటల కోసమింకా
ఎన్నేళ్ళని వెతుక్కుంటావు?

నీకొక్కడికే కాదు, ప్రతి ఒక్క కవికీ అనిపిస్తుంది
ఒక తియ్యనిగొంతు వినాలనీ
ఒక వసంతం, ఒక వేసవి, ఎడతెరిపిలేని
వానల కాలం ఒకటి గడిచిపోయాక
ఆకులూ, కాయలూ కూడా పండటం మొదలుపెట్టాక
ఇంతకాలం జీవించామన్న తృప్తితో
కాలభూర్జపత్రం మీద నిండుగా ఒక సంతకం చేసి
నిష్క్రమించాలని ఉంటుంది.

కానీ చూడాలిప్పటికైనా నువ్వు
ఈ కార్తిక అపరాహ్ణాల
ఒక కొస పట్టుకుని
నువ్వొక ఊయెల ఊపుతున్నావనీ

నువ్వు పాడుకుంటున్న జోలపాట వింటూ
నగరం ఒక బిడ్డగా
నిశ్చింతగా నిద్రిస్తోందనీ.

24-11-2024

## కోమలనిషాదం

అడవుల్లో ఆకుల్ని ఇండియన్ యెల్లోలో
ముంచితేల్చడం మొదలయ్యాక
చెట్లకొమ్మలమీంచి నీడల్లోకి
పత్రహరితం దిగుతుంటుంది.

అప్పటిదాకా పచ్చికబయళ్ళమీద
విహరించిన సూర్యుడిగోవులు
నెమ్మదిగా నెమరుకి ఉపక్రమిస్తాయి.

స్వరసప్తకం పూర్వార్థమంతా
ఒక ఉత్సాహం, రక్తవేగోద్ధృతి
నవ్యజీవనసంరంభం.

పొద్దున్నే కొట్టం తెరిచి
పశువుల్ని మేతకు తోలేటప్పటి
ఉరుకులు, పరుగులు.

స్వరసప్తకపు ఉత్తరార్థంలో
స్వరాలన్నీ సాయంకాలం వైపు
పయనించడం సహజం.

నదులు సముద్రంలో కలిసే
తావుల్లో చూసావా!
సంగమానికింకా చేరువకాకముందే
ఆ నేలంతా, ఆ గాలిలో
ఆ మడ అడవుల పొడుగునా
వాతావరణం మారిపోయి ఉంటుంది.

అప్పుడు నువ్వు నాలుగడుగులు నడిచినా
సముద్రపు నీలం నీ తలపుల్ని కమ్మేస్తుంది.

'నేను కదా చేసాను. ..'
'నేనెందుకలా చేసాను. ..'
'నేను చేసింది కాదు. ..'
'నేనలా చేసి ఉండవలసింది కాదు. ..'

ఈ తలపులు కట్టిపెట్టు.
ఆ సోఫాలో అట్లానే కొద్దిసేపు ఒరుగు.

చిన్న కునుకు తీసి లేచేలోపు
కట్టెయ్యడం మర్చిపోయిన కుళాయిలాగా
పసుపచ్చని సంగీతం
నీ డ్రాయింగురూములోంచి
వీథిలోకి ప్రవహిస్తూంటుంది.

ఇప్పటికో మరికొంతసేపటికో
సూర్యుడి గోవులు మేతముగిస్తాయి.

ఇళ్ళల్లో దీపాలు వెలిగిస్తారు.
దారి తప్పిపోయాను అనుకుంటున్నావా-

కోమలనిషాదం రెక్కలమీద
నీకు తెలీకుండానే
నువ్విప్పటికే దిగంతం దాటేసావు.

28-11-2024

వాడ్రేవు చినవీరభద్రుడు

# కోమలనిషాదం

మరికొన్ని కవితలు



వాడ్రేవు చినవీరభద్రుడు ఇప్పటిదాకా వెలువరించిన ఏడు కవితా సంపుటాలకు కొనసాగింపుగా వెలువరిస్తున్న ఎనిమిదవ కవితా సంపుటి ఇది. గత నాలుగేళ్ళుగా రాసిన నలభై మూడు కవితలతో పాటు, ఏడు పూర్వకవితలు కూడా ఇందులో ఉన్నాయి. వచన కవిత్వంతో పాటు గీతం, గేయం, గజల్, ముత్యాలసరం, ఐతిహాసిక దీర్ఘకవిత, రెండు పంక్తుల, నాలుగు పంక్తుల కవితల్లాంటి వివిధ ప్రక్రియల్లో కవి ఎప్పటికప్పుడు చేస్తూ వచ్చిన ప్రయోగవైవిధ్యం ఈ సంపుటంలో కనిపిస్తుంది. కాని ఎప్పటిలానే కవి వెలుతురిని పిండి వడగట్టడానికి చేస్తున్న సాధన ఈ కవిత్వంలో కూడా ఆద్యంతం కనిపిస్తుంది. ఈ సంపుటిని ప్రముఖ కవి, అనువాదకులు, భావుకులు నాగరాజు రామస్వామిగారికి కానుకగా అందిస్తున్నాము.